# తెలుగుప్రభ

మన భాష.. మన పత్రిక

teluguprabha.net

-TeluguPrabha @TeluguPrabhaofficial

TS వైబ్రెంట్ ఎడిషన్ 1 pm

18-7-2023




## కేరళ మాజీ సీఎం కన్నుమూత

12 పర్యాయాలు ఎమ్మెల్యే..
రెండుసార్లు ముఖ్యమంత్రిగా..

**తెలుగుప్రభ,తిరువనంతపురం(జూలై18):**

కేరళ మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ అగ్రనాయకుడు ఊమెన్‌చాందీ(79) నేటి తెల్లవారుజామున కన్నుమూశారు. కొంత కాలంగా అనారోగ్యంతో బెంగళూరులో చికిత్స పొందుతున్న ఆయన తుదిశ్వాస విడిచారు. ఈ విషయాన్ని ఆయన కుమారుడు సోషల్‌మీడియా ద్వారా ప్రకటించారు. కొట్టాయం జిల్లా పుతుప్పల్లిలో 1943 అక్టోబర్ 31న జన్మించిన ఊమెన్‌చాందీ, రాజకీయంగా కీలక పదవులెన్నో నిర్వహించారు. కేరళలో ఏకంగా 12 సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన ఘనమైన రికార్డు ఆయన సొంతం. రెండు పర్యాయాలు ముఖ్యమంత్రిగా కూడా పనిచే శారు. ఆలిండియా కాంగ్రెస్ కమిటీకి జనరల్ సెక్రటరీగా కూడా ఆయన పనిచేశారు. ఆయన పార్థివదేహాన్ని ప్రజల సందర్శనార్థం తిరువనంతపురానికి తరలించారు. కేరళ కాంగ్రెస్ అధ్యక్షుడు కె.సుధాకరన్‌తో పాటు పలువురు జాతీయస్థాయి కాంగ్రెస్ నేతలు ఆయన మృతికి సంతాపం ప్రకటించారు. 'పేమతో ప్రపంచాన్ని గెలిచిన రాజు కథ ముగిసింది' అంటూ సుధాకరన్ ట్వీట్ చేశారు. ఐదు దశాబ్దాలకు పైగా రాజకీయాల్లో ఉన్న ఆయన కాంగ్రెస్‌లోనే కొనసాగారు. కేరళ ప్రభుత్వం ఆయన గౌరవార్థం రెండు రోజులు సంతాపదినాలు ప్రకటించింది.




## నితీష్‌కు వ్యతిరేకంగా పోస్టర్లు

**తెలుగుప్రభ, బెంగళూరు(జూలై 18) :**

విపక్షాల కీలక సమావేశాలు జరుగుతున్న తరుణంలో నగరంలో బీహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్‌కు వ్యతిరేకంగ పోస్టర్లు, ఫ్లెక్సీలు వెలిశాయి. నగరంలోని చాళుక్య సర్కిల్, విండ్సర్ మేనర్ బ్రిడ్జి, హెబ్బాల్ సమీపంలోని విమానాశ్రయప్రాంతం, తదితర ప్రాంతాల్లో 'స్థిరత్వం లేని పీఎం పోటీదారు'అనే అర్థం వచ్చేలా రాసిన రాతలతో ఉన్న ఈ ఫ్లెక్సీల విషయం తెలిసి పోలీసులు వాటిని తొలగించారు.





# హోరా.. హోరీ!


అటు ఎన్‌డీఏ..
ఇటు యూపీఏ

ఒకే రోజు సమావేశాలు

తాము గెలవడం కంటే.. ప్రత్యర్థి ఓడిపోవడమే ముఖ్యం ?

**తెలుగుప్రభ, హైదరాబాద్(జూలై18):**

రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వాన్ని గద్దెదింపడమే లక్ష్యంగా ఓవైపు కాంగ్రెస్ చొరవతో బెంగళూరులో 26 విపక్షాల భేటీ కొనసాగుతుండగా.. మరోవైపు 38 పార్టీలతో బీజేపీ సారథ్యంలో అధికార ఎన్డీయే కూటమి సమావేశం నిర్వహిస్తోంది. బెంగళూరులో 'కలుద్దాం.. నిలుద్దాం' నినాదంతో విపక్షకూటమి నేతలందరి ఫొటోలతో భారీ బ్యానర్లు ఏర్పాటు కాగా.. మరోవైపు కూటమిలోని కీలక నేత బీహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్‌కు వ్యతిరేకంగా 'నిలకడలేని పీఎం పోటీదారు' పేరిట కూడా ఫ్లెక్సీలు కూడా వెలిశాయి. వచ్చే సంవత్సరం జరగబోయే లోక్‌సభ ఎన్నికలు లక్ష్యంగా రెండు కూటములు కూడా వైరిపక్షాన్ని దెబ్బతీయాలనే దృఢ సంకల్పంతోనే ఈ సమావేశాలు నిర్వహిస్తున్నాయి. రెండు కూటములు తామే గెలవాలనే లక్ష్యంతో ఉన్నప్పటికీ, వైరి పక్షాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ గెలవనీయకూడదన్న కసే ఎక్కువగా కనిపిస్తోంది. ఇందులో భాగంగానే విపక్షాల సమావేశం జరుగుతున్న తరుణంలోనే అధికార పక్షం సైతం సమావేశం నిర్వహిస్తోంది. గత ఎన్నిలకు భిన్నంగా విపక్షాలు ఏకమయ్యే పనిలో పడటంతో అధికార పక్షం కూడా వ్యూహాత్మకంగా సమావేశం నిర్వహిస్తోంది.ఈ సమావేశం ద్వారా ఎన్డీయేను బలోపేతం చేసేందుకు దూరమైన పాతమిత్రులకు కూడా స్వాగతం పలికింది. శిరోమణి అకాలీదళ్, లోక్‌జనశక్తి వంటి చిన్న పార్టీలకు సైతం ఆహ్వానాలు పంపింది. ఆ పార్టీలకు అండగా ఉండే దళిత,గిరిజన, బీసీ వర్గాల ఓట్లు గెలుపులో కీలకమని భావించడమే అందుకు కారణం.



### హ్యాట్రిక్‌కు అడ్డుకట్ట వేయడం ఎలా?

కేంద్రంలో బీజేపీ హ్యాట్రిక్‌ను నిలువరించడమే లక్ష్యంగా కాంగ్రెస్ పావులు కదుపుతోంది. సామాజిక న్యాయం, జాతీయ సంక్షేమం,సమ్మిళిత వృద్ధి వంటి అంశాలతో ఉమ్మడి కార్యాచరణ రూపొందించి ప్రజల్లోకి వెళ్లేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్‌కు చిరకాల శత్రువుగా ఉన్న మమతా బెనర్జీ సోమవారం సమావేశంలో కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ పక్కనే కూర్చోవడం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. మరోవైపు కూటమి కన్వీనర్‌గా నితీష్‌కుమార్ బాధ్యతలు తీసుకోవచ్చునని భావిస్తున్న నేపథ్యంలో ఆయనకు వ్యతిరేకంగా ఫ్లెక్సీలు ఏర్పాటుకావడం గమనార్హం.యూపీఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీకి కూటమిలో కీలక బాధ్యతలు అప్పజెప్పే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## టీఎస్‌కు 6వ, ఏపీకి 8వ ర్యాంక్

**నీతిఆయోగ్ విడుదల చేసిన ఎగుమతుల సన్నద్ధత సూచీ-2022లో తెలంగాణాకు 6వ ర్యాంక్ లభించింది. ఆంధ్రప్రదేశ్‌కు 8వ స్థానం దక్కింది. ఓవరాల్ స్కోర్‌లో తెలంగాణకు 61.36 శాతం, ఏపీకి 59.27 శాతం మార్కులు లభించాయి. తొలిఐదు స్థానాల్లో తమిళనాడు, మహారాష్ట్ర, కర్నాటక, గుజరాత్, హర్యానాలున్నాయి. 2020-21లో తెలంగాణ జీఎస్‌డీపీ రూ.6,41,24,429 కోట్లు కాగా, ఏపీ జీఎస్‌డీపీ రూ. 6,69,78,337.**

## వర్షంతో ఇబ్బందులా..

జీహెచ్ఎంసీ కాల్‌సెంటర్ నెంబర్

**040 21 11 11 11**



## బీ కేర్‌ఫుల్ !

అధికారులకు మేయర్ హెచ్చరిక

**తెలుగుప్రభ, హైదరాబాద్ (జూలై18)**

గ్రేటర్ వ్యాప్తంగా కురుస్తున్న వర్షాల వల్ల ఎలాంటి ప్రమాదాలు సంభవించకుండా జోనల్ కమిషనర్లు, సూపరింటెండింగ్ ఇంజినీర్లు, విపత్తు నిర్వహణ విభాగం, వర్షాకాల అత్యవసర బృందాలు అప్రమత్తంగా ఉండాలని నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి సూచించారు. యుద్ధ ప్రాతిపదికన అవసరమైన చర్యలు చేపట్టాలని, వరద నీటిని ఎప్పటికప్పుడు తొలగించాలని ఆదేశించారు. రానున్న కొద్ది రోజుల్లో నిరంతర భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరికలున్నందున అన్ని సర్కిళ్ల సంబంధిత అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. శిథిల భవనాలు, సెల్లార్ల తవ్వకాలపై ప్రత్యేక దృష్టి సారించి ప్రమాదాలు జరుగకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.నిర్లక్ష్యం వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజల నుంచి అందే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. వర్షాకాల సమస్యలపై ప్రజలు జీహెచ్ఎంసీ కాల్‌సెంటర్ నెంబర్ 040-21 11 11 11కు ఫోన్ చేయవచ్చునని తెలిపారు.



## రాహుల్ పిటిషన్‌ను స్వీకరించిన 'సుప్రీం'

**తెలుగుప్రభ, న్యూఢిల్లీ(జూలై 18):**

రాహుల్‌గాంధీ పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారణకు స్వీకరించింది. మోదీ ఇంటిపేరుకు సంబంధించి రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఆయనను దోషిగా తేల్చిన సూరత్‌కోర్టు ఆయనకు రెండేళ్ల జైలు శిక్ష విధించడం.. దానిపై స్టే కోరుతూ రాహుల్‌గాంధీ గుజరాత్‌హైకోర్టును ఆశ్రయించగా నిరాకరించడం తెలిసిందే. ఈ నేపథ్యంలో గుజరాత్ హైకోర్టు తీర్పుపై రాహుల్ గాంధీ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. రాహుల్ పిటిషన్‌పై సుప్రీం కోర్టు ఈనెల 21న విచారణ జరపనుంది.

## అయ్యో రేవంత్..!

**తెలుగుప్రభ, హైదరాబాద్ (జూలై 18)**

తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ఇటీవలి కాలంలో తనకు తానే టార్గెట్ అవుతున్నాడు. అనవసర వ్యాఖ్యలతో వైరల్ అవుతున్నాడు. తాజాగా రాజీవ్‌గాంధీ సతీమణి పేరును పొరపాటున పలికి సోషల్‌మీడియాలో న్యూస్ అయ్యారు. సోమవారం గాంధీభవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 'రాజీవ్‌గాంధీ సతీమణి ఇందిరాగాంధీ' అంటూ వ్యాఖ్యానించి ఆ తరువాత నాలుక కరుచుకున్నారు. రాజీవ్‌గాంధీ మాతృమూర్తి ఇందిరాగాంధీని సతీమణి అని వ్యాఖ్యానించడంతో అక్కడ ఉన్న కాంగ్రెస్ నాయకులు అంతా తలలు పట్టుకున్నారు. ఆ తరువాత రాజీవ్‌గాంధీ సతీమణి సోనియాగాంధీ అంటూ తప్పును దిద్దుకునే ప్రయత్నం చేశారు. కానీ అప్పటికే జరగాల్సిన డ్యామేజీ జరిగిపోయింది. రేవంత్‌రెడ్డి ఇలాగే సోయి లేకుండా మాట్లాడుకుంటూ పోతే పార్టీకి తీవ్ర నష్టం జరుగుతుందని వాపోతున్నారు



## హ్యాపీ బర్త్ డే మినిస్టర్ జగదీశ్

మంత్రికి శుభాకాంక్షలు వెల్లువ

**తెలుగుప్రభ, నల్లగొండ (జూలై 18)**

తెలంగాణ మంత్రి జగదీశ్ రెడ్డి పుట్టినరోజును పురస్కరించుకుని ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రజాప్రతినిధులు వేడుకలను ఘనంగా నిర్వహించారు. సోమవారం అర్ధరాత్రి హైదరాబాద్‌లోని మంత్రి నివాసానికి చేరుకున్న జిల్లా ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు మంత్రితో కేక్ కట్ చేయించారు. అనంతరం ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, ఎమ్మెల్యేలు శానంపూడి సైదిరెడ్డి, బొల్ల మల్లయ్య యాదవ్, గొంగిడి సుని, పైళ్ల శేఖర్ రెడ్డి, కంచర్ల భూపాల్ రెడ్డి, కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, నోముల భగత్, ఎమ్మెల్సీ శానంపూడి సైదిరెడ్డి, నల్లగొండ జెడ్పీ చైర్మన్ బంద నరేందర్ రెడ్డి పాల్గొన్నారు.

